క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: మరమ్మతుల కారణంగా 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ రోడ్డు, సిల్వర్‌సీగల్లీ, సుక్కమ్మ కుంట, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, సిటిజెన్ కాలనీ, ముత్తుస్వామి కాలనీ, సుష్మితనగర్, ఆనంద్‌నగర్, మోహన్‌రావు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, వీరభద్ర కాలనీలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ ఉండదని వారు తెలిపారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

మేడ్చల్: దళితులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాల కోసం మండల దళిత యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీడీఓ పద్మావతిలు కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా డెయిరీ ఫారం కోసం రెండు గేదెలు, రెండు ఆవులు అయితే రూ.2లక్షలు యూనిట్ ధరలో 70 శాతం సబ్సిడీతో, ఒక గేదె, ఒక ఆవు అయితే రూ.లక్ష యూనిట్ ధరలో 80 శాతం సబ్సిడీ, అదేవిధంగా 20 గొర్రెలు, ఒక పొట్టేలు అయితే రూ.1.75లక్షల యూనిట్ ధరకు 70 శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న దళిత యువ రైతులు తమ ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధృవపత్రాలు, రేషన్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పాసు పుస్తకం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, పది గుంటల భూమి పత్రాలతో ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

కుక్కల దాడుల నివారణకు హెల్ప్‌లైన్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు దాడుల నివారణకు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి, కమిషనర్ సురేష్ తెలిపారు. కుక్కల దాడులపై శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీధి కుక్కల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కుక్కల బెడద ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లు 14420, 8985773105, 9154812774లకు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు.

చీర్యాల నారసింహుడి సేవలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్



కీసర: చీర్యాల లక్ష్మీ నారసింహుడి సేవలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఎం.హనుమంత్‌రావు పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన హనుమంత్‌రావుకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువుదీరిన స్వామి వారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు హనుమంత్‌రావును స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహా ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లు హనుమంత్‌రావుకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కీసర: మాజీ ఎంపీటీసీ మచ్చాని జంగయ్యయాదవ్ తండ్రి మచ్చాని బాలయ్య అనారోగ్యం కారణంగా ఇటీవల మృతిచెందారు. ఈ సందర్భంగా శుక్రవా రం కీసరకు విచ్చేసిన మంత్రి మల్లారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి జంగయ్యయాదవ్‌తో పాటు ఆయ న కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కందాడి ముత్యంరెడ్డి, బాల్‌రాజ్, మహేష్, ప్రదీప్, రామిడి నరేందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, బొడుసు రమే ష్‌యాదవ్, సుమన్, బన్ని, నర్సింహ పాల్గొన్నారు.



చెన్నాపురం చెరువు

- చూసీచూడనట్లుగా రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



చెన్నాపురం చెరువు శిఖం భూముల్లో తాజాగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలు

చెరువు.. కనుమరుగు!

కబ్జా కోరల్లో జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని చెన్నాపురం చెరువు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నడి బొడ్డున ఉన్న చెన్నాపురం చెరువు కబ్జాకు గురవుతోంది. భూ కబ్జాకోరులు కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు ఎక్కడ కనిపించినా పాగా వేసి అమాయకులకు అమ్మేసి కోట్లు గడిస్తున్నారు. ప్రభుత్వ భూములు చాలవన్నట్లుగా చెరువు శిఖం భూములను సైతం వదలడం లేదు. తాజాగా చెన్నాపురం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు.

సుందరీకరణకు రూ.2 కోట్లు మంజూరు..

చెన్నాపురం చెరువు సుందరీకరణ కోసం గతేడాది రూ.2 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగిస్తుండటంతో ఇదే అదునుగా భావించిన భూకబ్జాదారులు చెరువులను మింగేస్తూ అందినకాడికి ఆక్రమిస్తున్నారు.

రూ.2 కోట్లు మంజూరైనా కానరాని ఇరిగేషన్ చర్యలు...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనుల్లో భాగంగా గతంలో చెన్నాపురం చెరువు మరమ్మతులు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాడు కాంట్రాక్టర్ నిర్మించిన చెరువు కట్ట పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. మరో మారు మున్సిపల్ అధికారులు చెరువు సుందరీకరణ కోసం విజ్ఞప్తి చేయడంతో ప్రభుత్వం రూ.2కోట్లను మంజూరు చేసింది. ఇరిగేషన్ అధికారులు చెన్నాపురం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని గుర్తించకపోవడంతో సుమారు 25 ఎకరాలు ఉన్న చెరువు కేవలం ప్రస్తుతం 10 ఎకరాలలోపే ఉండటం గమనార్హం. ఇప్పటికైనా ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు కార్పొరేషన్ పరిధిలోని చెరువులన్నింటినీ ఫెన్సింగ్ చేసి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం



జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువు శిఖం భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సమాచారం అందింది. విచారణ చేయించి అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. ఎఫ్‌టీఎల్ పరిధిలో, ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రవి, ఆర్డీఓ, కీసర

చెరువులను కాపాడతాం



జవహర్‌నగర్ నడిబొడ్డున ఉన్న చెన్నాపురం చెరువును ఎట్టి పరిస్థితుల్లో కబ్జాకు గురికాకుండా కాపాడుకుంటాం. రూ.2 కోట్లతో చెరువు సుందరీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఎవరు చేపట్టినా సహించం. ఎంతటి వారైనా చర్యలు తప్పవు.

– మేకల కావ్య, మేయర్, జవహర్‌నగర్

ప్రభుత్వ లక్ష్యాలకు తగ్గట్టుగా పని చేస్తాం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ఆయన కంటి వెలుగు, రెండు పడక గదుల నిర్మాణం, 58, 59 ప్రభుత్వ జీఓల ప్రకారం.. ఇళ్ల క్రమబద్ధీకరణపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జీఓ 58, 59, 118లకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి నెలాఖరు వరకు క్రమబద్ధీకరణకు సంబంధించిన కార్యక్రమాలు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. 118 జీఓకు సంబంధించి మార్చి 10వ తేదీ వరకు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమయ్యేలా సంబంధిత శాఖల జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, సూచనలు తప్పకుండా పాటిస్తామని కలెక్టర్ వారితో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనలివే..

నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. జిల్లాల వారీగా పట్టాలు లేకుండా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు, ఆబాది గ్రామకంఠం, శిఖం, వక్ఫ్, దేవాదాయ భూముల వివరాలను ప్రోఫార్మా–1 ప్రకారం సేకరించామన్నారు. జీఓ 58, 59 ప్రకారం.. వాటిని మరోసారి పరిశీలించాలన్నారు. 25 పని దినాల్లో 51.86 లక్షల మంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించామని, జిల్లాల్లో ఏర్పాటు చేసిన క్వాలిటీ కంట్రోల్ బృందాలు కంటి వెలుగు శిబిరాలను పర్యటించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ మినహాయించి పట్టణాల్లో నిర్మాణం పూర్తి చేసిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం మరో 21,787 లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్

మంత్రి చామకూర మల్లారెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ 5వ వార్డుకు చెందిన నర్సమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.లక్షకు సంబంధించిన చెక్కును లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, నానునాయక్, నాయకులు వెంకటేష్, భాస్కర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడు కుందన్‌పల్లి కృష్ణకు...

కుందన్‌పల్లికి చెందిన కృష్ణకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.లక్ష చెక్కును బీఆర్ఎస్ నేత కొత్త శ్రీనివాస్‌గౌడ్ లబ్ధిదారుడికి అందజేశారు.

కీసర గ్రామస్తులకు...

సీఎం రిలీఫ్ ఫండ్ కింద కీసర గ్రామానికి చెందిన మొరుగు మహేశ్వరికి రూ38,500, టి.గణేష్‌కు రూ.58,500లకు సంబంధించిన చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, బీఆర్ఎస్ నాయకులు శీలం మల్లేష్, చినింగని బాల్‌రాజ్, సుమన్, బన్ని, రాగుల మంగమ్మ, రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్, పరమేష్‌యాదవ్, వెంకటేష్, మంత్రాల వెంకటేష్, లత, సోని, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి డీఎస్‌ఆర్ కాలనీ సమీపంలో కొత్తగా నిర్మించిన శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో మంత్రి మల్లారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కౌన్సిలర్ కళావతి, అంజయ్యగౌడ్, కాంసాని మల్లారెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

మేడ్చల్: మేడ్చల్ ఆర్టీసీ కాలనీలో గల తుమ్మ చెరువు కట్టపై నిర్మించిన కట్ట మైసమ్మ ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం చండీ హోమంను భక్తుల సందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్చరణలతో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద కాలనీ వాసులు భజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకలో ఆర్టీసీ కాలనీ వాసులతో పాటు పట్టణంలోని వివిధ కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి పనులు

కీసర: మున్సిపాలిటీలు, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి అన్నారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి, కీసర మండలం చీర్యాల గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్మశాన వాటికల అభివృద్ధికి, డంపింగ్ యార్డుల ఏర్పాటుకు, ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, రైతు వేదికలు, ఎల్‌ఈడీ బల్బులు, స్వచ్ఛభారత్, ఉచిత రేషన్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. ఈ పథకాలను తమ నిధులతోనే చేపడుతున్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొంస్తూ ప్రజలను మభ్యపెడుతుందని మండిపడ్డారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి నాగేష్, లక్ష్మీ వేణుగోపాల్, జిల్లాల తిరుమల్‌రెడ్డి, శ్యాంసుందర్, బాల్‌రాజ్, నాగేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

కండ్లకోయలో...

మేడ్చల్‌రూరల్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీఆర్ఎస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పి కాలం వెళ్లదీస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాధవి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు హంసరాణి, అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, ప్రభాకర్, మమత, నవనీత, త్రివేణి, రేఖ తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో...

సాక్షి, సిటీబ్యూరో: కేంద్రం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను స్థానిక బీఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రభుత్వానివని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని బీజేపీ మండలాధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు విమర్శించారు. బీజేపీ చేపట్టిన 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా అంకుషాపూర్‌లో శుక్రవారం జరిగిన కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నేత శ్రీని వాస్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, బీ జేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, శక్తి కేంద్రం ఇన్‌చార్జి దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, గణేష్, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ రవీంద్రరావు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ డిప్యూటీ కమిషనర్ రవీంద్రరావు అవుషాపూర్, కొర్రెముల్ గ్రామాన్ని జెడ్పీ సీఈఓ దేవసహాయం, డీఎల్పీఓ రమణామూర్తితో కలిసి శుక్రవారం సందర్శించారు. కేంద్రం పంచాయతీలకు ఇచ్చే చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అంశంలో అవుషాపూర్, సోషల్ సెక్యూరిటీ అంశంలో అవార్డు ఎంపిక కోసం కొర్రెముల్ పంచాయతీ అప్‌లోడ్ చేసిన పత్రాలు, ఇతర పలు అంశాలు తనిఖీ చేశారు. అనంతరం అవార్డు గెలుచుకోవడానికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, డీఎల్పీఓ స్మిత, ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎంపీఓ నందకిశోర్ పాల్గొన్నారు.

మల్లారెడ్డి మహిళా కళాశాలలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ప్రారంభమైంది. టెక్‌ట్రోఫీ–2కె23 పేరిట నిర్వహిస్తున్న ఈ టోర్నీని జేఎన్‌టీయూహెచ్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఎస్ఎస్ దిలీప్, కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలతలు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు తలపడనున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీ, హెచ్‌ఓడీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పేటెంట్స్‌పై అవగాహన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం పేటెంట్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ దాసరి అయోధ్య విద్యార్థులకు పేటెంట్స్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహా రెడ్డి, సెక్రెటరీ త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, ట్రెజరర్ త్రిలోక్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు

రహదారి అన్యాక్రాంతంపై విచారణ



విచారణ చేపడుతున్న డీఆర్‌డీఏ అధికారిని

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో రహదారి అన్యాక్రాంతమైతున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై జిల్లా డీఆర్‌డీఏ అధికారి పద్మజారాణి శుక్రవారం విచారణ చేపట్టారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లి చౌరస్తా ప్రధాన రహదారి నుంచి రాజ్‌సుఖ్‌నగర్, సత్యనారాయణకాలనీ, హనుమాన్‌నగర్, అన్నపూర్ణనగర్ తదితర కాలనీలకు సంబంధించిన 40 ఫీట్ల రహదారి అన్యాక్రాంతమైందని పలు కాలనీవాసులు జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో డీఆర్‌డీఏ అధికారిని పద్మజారాణి కాలనీవాసులతో మాట్లాడి సంబంధిత రహదారిని పరిశీలించారు. ప్రస్తుతం శ్రీపురంకాలనీ పేరిట ఉన్న లేఅవుట్‌లో ప్లాట్‌గా చూపిస్తూ ప్రధాన రహదారిలో గల 40 అడుగుల రహదారిని బంద్ చేసి ఆ స్థలంలో మార్బుల్ షాప్‌ను ఏర్పాటు చేసారని కాలనీ వాసులు డీఆర్‌డీఏ అధికారికి తెలిపారు. దీంతో ప్రస్తుతం మార్బుల్ దుకాణం ఏర్పాటు చేసిన వ్యక్తి వద్ద ఉన్న డాక్యుమెంట్లను డీఆర్‌డీఏ పరిశీలించారు. రాజ్‌సుఖ్‌నగర్ లేఅవుట్, శ్రీపురం కాలనీ లేఅవుట్ కాపీలను, సంబంధిత డాక్యుమెంట్లను సేకరించిన ఆమె నివేదికను జిల్లా అదనపు కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించండి



ప్రచారం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: శాసన మండలిలో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి సంఘాల అధ్యాపక ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని పట్టణంలోని జెడ్పీ బాలికలు, జెడ్పీ అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ స్కూల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రామలింగారెడ్డి, జోగారావు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్ వీబీఐటీ

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ స్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో అవుషాపూర్ వీబీఐటీ జట్టు విజేతగా నిలిచింది. బాచుపల్లి వీజేఐఎం కళాశాలలో శుక్రవారం జరిగిన తుది పోరులో వీఎన్ఆర్ వీజేఐటీ పోటీ పడగా వీబీఐటీ జట్టు విజేతగా నిలిచిందని వీబీఐటీ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వీజేఐటీ ప్రిన్సిపాల్, డైరెక్టర్ విజేతలకు షీల్డ్, నగదు బహుమతి ప్రదానం చేశారు.



షీల్డ్ అందుకుంటున్న వీబీఐటీ జట్టు క్రీడాకారులు, పీడీ శ్రీనివాస్‌రెడ్డి

'బీఆర్ఎస్ పాలనలో అప్పులకుప్పగా తెలంగాణ'



హాత్ సే హాత్ జోడో యాత్రలో వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ శ్రేణులు

మేడ్చల్‌రూరల్: తెలంగాణ ప్రజల ఆకాంక్ష, అమరుల త్యాగాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ మైసమ్మగూడలో శుక్రవారం కాంగ్రెస్ 'హాత్ సే హాత్ జోడో' యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మంత్రి అయినప్పటికీ నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తేవడంలో విఫలమయ్యారని, నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపనలు చేసిన ఏ అభివృద్ధి కార్యక్రమం పూర్తయ్యిందో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏ–బ్లాక్ అధ్యక్షుడు పోచయ్య, నాయకులు నర్సింహులు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, రేగురాజు, కృష్ణారెడ్డి, హన్మంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

ఇంజినీరింగ్‌లో బ్యాక్‌లాగ్స్ ఉండటంతో..

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



సాయిప్రణీత్‌రెడ్డి (ఫైల్)

జవహర్‌నగర్: పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం.. ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలో నివసించే కైపా శ్రీనివాస్ రెడ్డి ప్రైవేట్ ఉద్యోగి. ఈయన భార్య కైపా శిరీషారెడ్డి కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు. వీరి కుమారుడు సాయి ప్రణీత్‌రెడ్డి(22) దూలపల్లిలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. కానీ ఇంజినీరింగ్‌లో బ్యాక్‌లాగ్స్ మిగిలే ఉన్నాయి. శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి ఉద్యోగానికి, శిరీషారెడ్డి ఓ వివాహానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేకపోవడంతో తన పడక గదిలో సాయి ప్రణీత్‌రెడ్డి టవల్‌తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి తిరిగివచ్చిన తండ్రి ఇంటి తలుపులు తట్టినా తీయకపోవడంతో కిటికీలోంచి చూడగా ప్రణీత్‌రెడ్డి ఉరి వేసుకొని కనిపించడంతో ఇంటి తలుపులు బద్దలు కొట్టి సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే అతడు మృతిచెందారని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఏకైక కుమారుడు మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ అబిద్

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీతారాం వివరాల ప్రకారం.. బాలాజీనగర్ వెంకటేశ్వర కాలనీలో నివసించే మహ్మద్ జాహెదా బేదం తన ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలతో ఉంటున్నారు. మూడో కుమారుడు మహ్మద్ అబిద్(25)కు మతిస్థిమితం బాగాలేకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అబిద్ తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





వనదర్శిని..

తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనదర్శిని కార్యక్రమం శుక్రవారం కీసరగుట్ట పెద్దమ్మ చెరువు సమీపంలో గల ఎకో పార్కులో చేపట్టారు. చీర్యాల గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు ఈ వన సందర్శనలో పాల్గొన్నారు. అటవీ శాఖ అధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ వన సంపద రక్షణ కొరకు చేపడుతున్న చర్యలను విద్యార్థులకు తెలియజేశారు. ఎకో పార్కు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి పర్యటించి అటవీ సంపద, పార్కు పరిధిలో పెంచుతున్న వివిధ రకాల మొక్కలు, వృక్షాలకు సంబంధించి పలు విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ నిర్వహించి బహుమతులను అందజేశారు. – కీసర

